క్లుప్తంగా

చేగువేరా స్ఫూర్తితో మతోన్మాదాన్ని తరిమికొడదాం



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: జనం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన వీరుడు చేగువేరా స్ఫూర్తితో దేశంలో మతోన్మాదాన్ని తరిమిడదామని డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో చేగువేరా 57వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకలిస్తేనే శాంతి వర్ధిల్లుతుందని భావించి అనేక విప్లవాలకు శ్రీకారం చుట్టిన యోధుడు చేగువేరా అని కొనియాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు లక్ష్మీనారాయణ, చందూ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: కల్లూరులో ఏఐవైఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 57వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ చేగువేరా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శర్మాస్, కాశీ విశ్వనాథ్, అశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గుత్తి రూరల్: వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఆపి ఉన్న కారును వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన మోహన్‌కృష్ణ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సెలవులు ఉండటంతో భార్య, పిల్లలతో కలిసి కరీంనగర్‌కు కారులో బయలుదేరాడు. వన్నేదొడ్డి గ్రామ శివారులోకి రాగానే కారు పంక్చర్ అయింది. దీంతో కారును రోడ్డు పక్కన ఆపి టైరును మారుస్తుండగా వెనుక నుంచి బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో కారులో కూర్చున్న మోహన్‌కృష్ణ భార్య శిరీష గాయపడగా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన శిరీషను వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం, డ్రైవర్‌ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వాసుదేవరెడ్డి



యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వాసుదేవరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ సౌజన్య డీపీఆర్సీకి డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఎంపీడీఓ కార్యాలయ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న వాసుదేవరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

సభ్యత్వం పెంచాలి


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

బుక్కరాయసముద్రం: గ్రంథాలయ సభ్యత్వం పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో లైబ్రరీని తనిఖీ చేశారు. ముందుగా లైబ్రరీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రంథాలయ అధికారి విజయభాస్కర్ ఉన్నారు.

దోబీఘాట్ పరిశీలన


దోబీ ఘాట్ వద్ద వివరాలను తెలుసుకుంటున్న సీఐ కరుణాకర్

బుక్కరాయసముద్రం: స్థానిక జన చైతన్య నగర్ కాలనీ సమీపంలో ఉన్న దోబీ ఘాట్‌ను సీఐ కరుణాకర్ పరిశీలించారు. దోబీఘాట్ ఆక్రమణకు గురవుతోందని పలువురు రజకులు కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సీఐ దోబీఘాట్ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. గత ప్రభుత్వం దోబీ ఘాట్, బోరు, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టిందని రజకులు తెలిపారు. దోబీఘాట్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని రజకులు వెంకటేశు, క్రిష, శ్రీనివాసులు, నాగరాజు, బాల వెంకటేశు, వీర నారప్ప, లక్ష్మి నారాయణ, రామప్ప, సుబ్బరాయుడు, సూరి, రమేష్ తదితరులు సీఐకు విన్నవించారు.

పశువైద్యశాల ఏర్పాటయ్యేదెన్నడో?

- 23 పంచాయతీలకు ఒకే వైద్యశాల
- పాడి రైతులకు తప్పని కష్టాలు


పుట్లూరులోని పశు వైద్యశాల

పుట్లూరు: మండలానికంతా కేవలం పుట్లూరులో పశు వైద్యశాల ఉండటంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో పశు వైద్యశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా ఆచరణకు నోచుకోవడం లేదు. పుట్లూరులోని పశు వైద్యశాల 18 గ్రామాల పాడి రైతులకు మాత్రమే అనువుగా ఉంది. కడవకల్లు, సూరేపల్లి, అరకటివేముల, కొండాపురం, మడ్డిపల్లి, ఓబుళాపురం, దోశలేడు, చాలవేముల, నారాయణరెడ్డిపల్లి, చెర్లోపల్లి, గొల్లపల్లి, కుమ్మనమల తదితర గ్రామాల పాడి రైతులు, గొర్రెల కాపరులు పుట్లూరులోని పశు వైద్యశాలకు రావడానికి కష్టతరంగా మారింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి సచివాలయ పరిధిలో పశువైద్య సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు సంచార పశు వైద్య సేవలను ప్రారంభించడంతో పాడి రైతులకు ఉపశమనం కలుగుతోంది. మండలంలో పశువులు 5250, మేకలు, గొర్రెలు 34000 దాకా ఉన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

పాడి రైతులు, గొర్రెల కాపరుల సమస్యను తొలగించడానికి మరో పశువైద్యశాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కడవకల్లు గ్రామంలో పశు వైద్యశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా స్థలం లేదనే కారణంతో దోశలేడులో పశువైద్యశాల భవన నిర్మాణం చేపట్టడానికి 2019లో ప్రతిపాదనలు పంపారు. అయితే పశువైద్యశాల నిర్మాణానికి అడుగులు ముందుకుపడడం లేదు.

శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల

మండల కేంద్రంలో పశువైద్యశాలకు సొంత భవనం లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ సబ్ సెంటర్ క్వార్టర్స్‌లో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. వర్షం వచ్చిన సమయంలో ఆసుపత్రి ఉన్న భవనం కారుతుండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ఆసుపత్రిలో తగినంత సిబ్బంది లేకపోవడం, బుక్కపురం పశువైద్యశాల వైద్యాధికారి నాగసువర్ణ పుట్లూరు ఆసుపత్రికి ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు.

పశువైద్యశాల నిర్మించాలి



మండలంలో 23 గ్రామ పంచాయతీలకు మండల కేంద్రంలో మాత్రమే పశువైద్యశాల ఉంది. కడవకల్లు ప్రాంతంలో మరో పశువైద్యశాల ఏర్పాటు చేస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న భవనం స్థానంలో కొత్తది నిర్మించడంతోటు మరో వైద్యశాల ఏర్పాటు చేయాలి. –వెంకటచౌదరి, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి

ప్రతిపాదనలు పంపాం



పుట్లూరు మండలం దోశలేడు గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే పుట్లూరులో నూతన పశువైద్యశాల నిర్మాణం చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – నాగసువర్ణ, పశు వైద్యాధికారి, పుట్లూరు

ధరల పెరుగుదలపై వినూత్న నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: నిత్యావసరాలు, కూరగాయల ధరలపై సీపీఎం, ఐద్వా నాయకులు బుధవారం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద గడ్డితిని వినూత్న నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయని, ధరలను తగ్గించకపోతే ప్రజలు ఏం తిని బతుకుతారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ధరలను విపరీతంగా పెంచేసి పండుగ పూట ప్రజలు కడుపునిండా తినకుండా చేసిన ఘనత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానిదేనని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసరాల ధరలను నియంత్రించాలని, చౌకధాన్యపు డిపోల ద్వారా సరుకులను తక్కువ ధరకు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మారుతి, జగ్గిలిరమేష్, నాగరాజు, సి.రమేష్, ఐద్వా నేతలు రంగమ్మ, పూర్ణిమ, భాగ్యమ్మ, శారద, డీవైఎఫ్‌ఐ నాయకులు రాము, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి


విద్యుత్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రిటౌన్: విద్యుత్ సమస్య తీర్చాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. పట్టణంలోని పోరాట కాలనీ, శివాలయం వీధిలో విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల వసూలుపై చూపే శ్రద్ధ విద్యుత్ సరఫరాలో చూపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యాయన్నారు. అనంతరం డీఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, రామాంజినేయులు, రత్నమయ్య, అబ్రహం, ఏఐటీయూసీ నాయకులు రమణరవికుమార్, ఆమాగౌడ్, హాజీవలి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దాం


గుత్తిరూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుత్తి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి సర్పంచులు, వార్డు సభ్యులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో ఉన్న వనరులతో ఆదాయం ఎలా సమకూర్చాలనే అంశంపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, సొంత ఆదాయ వనరులు తదితర అంశాలపై సర్పంచ్, వార్డు సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీలకు స్వయంగా ఆదాయం సమకూర్చుకునేలా సర్పంచ్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, శిక్షకుడు శ్రీధర్‌గౌడ్, సర్పంచ్‌లు చిదంబరి, పాపన్న, కార్యదర్శి దనలక్ష్మి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: పంచాయతీల అభివృద్ధిపై సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. గ్రామ పంచాయతీల పాలనపై ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. డీఎల్‌డీఓ, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి మాట్లాడుతూ గ్రామ పాలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర వాటిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పంచాయతీల ఆస్తుల పరిరక్షణ, ఆర్థిక వ్యవహారాలు, భవణ నిర్మాణ అనుమతులు తదితర వాటిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

యల్లనూరు: పంచాయతీల పాలనపై ప్రజాప్రతినిధులు అవగాహన కల్గి ఉండాలని ఎంపీపీ గంగాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో చేయాల్సిన పనులపై వివరించారు. ఈ కార్యక్రమానికి ఏపీవో షబ్బీర్‌బాషా, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. గురువారం కూడా ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఉందని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు.

గార్లదిన్నె: ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసం దర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌళిక వసతులు, వనరులు, ఆదాయం, నిధుల లభ్యత, గ్రామ ప్రజల ప్రాధాన్యత ప్రకారం నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయితీ పరిపాలనపై రెండురోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ తేజోష్ణ ఆధ్వర్యంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్ ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు అవగాహన కల్పించారు.

శింగనమల: గ్రామాల్లో ప్రజల సహకారంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పంచాయతీల పాలనపై అవగాహన కల్పించారు.

ఆధునిక పద్ధతులతో అధిక ఆదాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతి

గంతకల్లు రూరల్: పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందొచ్చని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. బుధవారం దంచర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించిన ఆమె ఎరువుల యాజమాన్యం, పంట సాగులో మెలకువలు, ప్రకృతి వ్యవసాయం, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

యాడికి: రాయల చెరువు గ్రామంలో బుధవారం ఉద్యాన వన, వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఓ ఉమాదేవి, ఏఓ మహబూబ్‌బాషా అరటి, జొన్న, సజ్జ పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

దేవదాయ శాఖ ఈఓగా రామాంజనేయులు



తాడిపత్రి రూరల్ : దేవదాయశాఖ ఈఓగా బుధవారం రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ సుబ్రమాణ్యం బదిలీపై వెళ్లారు. రామాంజనేయులు పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామి, ఆలూరు కోన రంగనాథస్వామి, యుగుడూరు గంగమ్మతల్లి, పెద్దపప్పూరు మండలం అశ్వర్థ నారాయణస్వామి, భీమలింగేశ్వరస్వామి ఆలయాల ఈఓగా వ్యవహరిస్తారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తాడిపత్రి ప్రాంతానికి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రైళ్లల్లో వస్తున్నాయన్న సమాచారంతో ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు. తాడిపత్రి పట్టణ, రూరల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ కొనసాగిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా ఫ్యాక్షన్ కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. బుధవారం దంతలపల్లిలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనులు చేసుకోవాలన్నారు. పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫ్యాక్షన్ కోరల్లో నుంచి బయటపడాలని సూచించాచారు. మట్కా, పేకాట, గుట్కా, ఇసుక అక్రమ రవాణా వంటి వాటిని సహించేది లేదన్నారు. ఎస్‌ఐ రాం ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

గుత్తి: పట్టణంలో ఈ నెల 17న తలపెట్టిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బుధవారం వాల్మీకి సంఘం నాయకులు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీతోపాటు అన్నదానం నిర్వహిస్తామన్నారు. వాల్మీకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

సా మాం పాతు సరస్వతి

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవరాత్రులు మహోత్సవాలు తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీ రూపంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


గుంతకల్లులో సరస్వతీ దేవి అలంకరణలో వాసవీమాత


పామిడి భోగేశ్వరాలయంలో సరస్వతీదేవిగా ప్రసన్న పార్వతి


గుత్తిలో సరస్వతీ దేవి రూపంలో వాసవీమాత


గుత్తి సేవాగఢ్‌లో సరస్వతిగా మాతా జగదాంబ


గుంతకల్లులో మారెమ్మ దేవిని సరస్వతీ దేవిగా అలంకరించిన దృశ్యం


గార్లదిన్నె మండలం కల్లూరులో సరస్వతీ దేవి రూపంలో వాసవీమాత


తాడిపత్రిలో సరస్వతి అలంకరణలో విజయచాముండేశ్వరి

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించండి

పుట్లూరు: వీఆర్‌ఓలు గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. బదిలీపై వచ్చిన వీఆర్‌ఓలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడవకల్లుకు శ్యామలాదేవి, అరకటివేముల రామకృష్ణ, గూడూరుకు శివప్రసాద్, కోమటికుంట్లకు రామాంజనేయులు, కందికాపులకు వెంకటేశ్వర రావు, మడుగుపల్లి ఆషీక్ నియమితులయ్యారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌గా రాజ బాధ్యతలు స్వీకరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గుంతకల్లు రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటేశ్వరి పేర్కొన్నారు. స్వచ్ఛతా డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని అమృతవర్షిణి బాల కళ్యాణ ఆశ్రమాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హోమ్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు అందజేస్తున్న నీరు స్వచ్ఛంగా ఉండాలని హోమ్ నిర్వాహకులకు సూచించారు. హోమ్‌లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి అందులో లభించే నాణ్యమైన కూరగాయలు వినియోగించుకోవాలని సూచించారు.

మద్యం షాపులకు 119 దరఖాస్తులు

గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం నాటికి మద్యం షాపుల కోసం 119 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ గురునాథ్‌రెడ్డి తెలిపారు. గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో గుత్తిలో అత్యధికంగా ఏడు షాపులకు గాను 85 దరఖాస్తులు వచ్చాయన్నారు. పామిడిలో నాలుగు షాపులకు 15, యాడికిలో నాలుగు షాపులకు 13, పెద్దవడుగూరు మూడు షాపులకు ఆరు దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

తాడిపత్రి రూరల్ : సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రానైట్ ఫ్యాక్టరీలు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు యజమానులు వివరించారు. నిర్వహణ భారమై ఫ్యాక్టరీలు మూసివేశామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గార్లదిన్నె: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా బుధవారం తెలిపారు. పెనకచెర్లకు చెందిన సోమశేఖర్, మధుసూదన్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమతి లేకుండా 24 మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జాతీయ ఖోఖో జట్టుకు 'గేట్స్' విద్యార్థి

గుత్తి: గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ లో ఈసీఈ ఫస్టియర్ చదువుతున్న వీర శేఖర్ జాతీయ ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి బుధవారం చెప్పారు. నెల్లూరులోని ఎన్‌బీకెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో సెలెక్షన్స్‌లో వీర శేఖర్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. దీంతో నిర్వాహకులు అతడిని ఖోఖో జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. గేట్స్ కాలేజీ ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి తదితరులు వీర శేఖర్‌ను అభినందించారు.

మండలానికి చేరిన పప్పుశనగ

యల్లనూరు: సబ్సిడీతో పంపిణీ చేస్తున్న విత్తన పప్పుశనగ మండల కేంద్రానికి చేరింది. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రైతు సేవా కేంద్రంలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన 500 బ్యాగుల పప్పుశనగ బస్తాలను నిల్వ చేశారు. అనంతరం ఎంపీఈఓలు యల్లనూరు, వెంకటాద్రిపల్లి, జంగంపల్లి, పాతపల్లి రైతులకు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తాడిపత్రి విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రిటౌన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా తెలిపారు. ఈనెల 6,7,8 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14, 17 విభాగంలో తాడిపత్రికి చెందిన లలిత (సాయిచైతన్య స్కూల్) కాంస్యం, తబ్రేజ్ (శ్రీవాణి స్కూల్) రజతం, రాకేష్ (చర్చి స్కూల్) కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను సాయిబాబాతోపాటు జిల్లా టీం కోచ్ నరేష్, షేక్షావలి అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


డివైడర్‌ను ఢీ కొన్న కారు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. అనంతపురం నుంచి గుత్తిలోకి వస్తున్న కారు బస్టాండ్ వద్దకు రాగానే ఓ వృద్ధుడు అడ్డుగా వచ్చాడు. వెంటనే అప్రమత్తమైన కారు డ్రైవర్ కారును పక్కకు తిప్పడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శ్రీనివాసపురంలో మట్కా నిర్వహిస్తున్న దూదేకుల సిద్ధిభాషాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.25,230 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

గుంతకల్లు రూరల్: మట్కా నిర్వహిస్తున్న వైటీ చెరువు గ్రామానికి చెందిన రామాంజనేయులు, అంజనప్రసాద్, ప్యాపిలికి చెందిన వెంకటేష్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.68,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.